క్లుప్తంగా

మహాశివరాత్రి మహోత్సవాల అంకురార్పణ

సత్తెనపల్లి: మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో అంకురార్పణ చేపట్టారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, రక్షాబంధనం, అఖండ స్థాపన, గోపూజ, దీక్ష స్వీకరణ, కై లాస మండపారాధన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్‌కు ఘన నివాళి

అచ్చంపేట: లంబాడ, బంజారాల దైవ స్వరూపులు సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన ప్రజావేదిక అధ్యక్షుడు బాణావతు రామకోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ తత్వ పరిజ్ఞానంతో అనేక గిరిజన తండాలు సంచరిస్తూ ఆనాటి అనాగరిక సమాజంలో బంజారా లంబాడాలకు నాగరికత నేర్పినట్లు చెప్పారు. మద్యం, మాంసాహారం భుజించరాదని, శాంతియుత జీవనం గడపాలని, అహింస భక్తి మార్గంలో జీవించాలని బోధనలు చేసిన మహనీయులు సేవాలాల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాడువాయి సర్పంచ్ భూక్యా మంత్రియ నాయక్, మాదిపాడు ఎంపీటీసీ భూక్యా రమేష్ నాయక్, నీలేశ్వరపాలెం సర్పంచ్ కోటేశ్వరరావు నాయక్, హనుమా నాయక్, కొండలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు ప్రత్యామ్నాయ స్థలం చూడాలి

రాజుపాలెం: రహదారి విస్తరణలో భాగంగా రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రాల తొలగింపునకు ప్రజలందరూ సహకరించాలని తహసీల్దార్ ఎ.నళిని కోరారు. కొండమోడు–పేరేచర్ల రోడ్డు జాతీయ రహదారిగా విస్తరిస్తున్న సందర్భంగా స్థానిక అంకమ్మతల్లి, ఆంజనేయస్వామి దేవాలయాలు తొలగింపుపై స్థానిక గ్రామ పెద్దలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్డువిస్తరణలో భాగంగా సదరు ఆలయాలు తొలగించాల్సి వస్తుందన్నారు. రెండు దేవాలయాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ఆర్‌బీకే సలహా మండలి చైర్మన్ కేదారి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సకినాల వలిరాజు, చొక్కా గాలయ్య, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి మంత్రి నివాళి

నకరికల్లు: కార్యకర్తల మృతి పార్టీకి తీరని లోటు అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. నకరికల్లుకు చెందిన బెల్లంకొండ శివ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బుధవారం నకరికల్లు వచ్చిన మంత్రి అంబటి మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, దూదేకుల బాషా, బెల్లంకొండ గిరి, పలువురు పార్టీ నాయకులు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో సబ్ జైలు నందు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, 11 కేవీ విద్యుత్ లైన్ మార్పిడి పనుల కారణంగా పట్టణంలో గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పి.రవికిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేస్టేషన్ రోడ్‌లోని మద్దివారి భావి సెంటర్, ఏరియా వైద్యశాల, సబ్‌జైలు ఏరియా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు. విద్యుత్తుకు సంబంధించి సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్ 9494116238కు సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు మంచినీటి సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలో రక్షిత మంచినీటి పథకం కొత్త ప్లాంట్ ఫిల్టర్ బెడ్ మరమ్మతులు జరుగుతున్నాయని, గురు, శుక్రవారాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 10 నుంచి 24 వార్డుల్లోని.. వెంగళ రెడ్డి నగర్, పార్క్ ఏరియా, రఘురాం నగర్, రాజుల కాలనీ, బోయ కాలని, వడ్డవల్లి శాస్త్రి నగర్, మున్సిపల్ ఏరియా, కొత్తపేట, సాలిపేట, యానాది కాలనీ, నాగన్న కుంట, మెయిన్ రోడ్‌లో సగం ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు పురపాలకు సంఘానికి సహకరించాలని కోరారు.

బడుగుల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వ పథకాలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- గడప గడపకు మన ప్రభుత్వంలో 332 కుటుంబాల పలుకరింపు..



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని ఒకటవ సచివాలయం (రంగా కాలనీ) పరిధిలో 1వ వార్డులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును, వలంటీర్ల సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటవ సచివాలయం పరిధిలో గత మూడేళ్లలో రూ.11.31 కోట్లు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వీటిలో సంక్షేమ పథకాలకు రూ.9.56 కోట్లు, అభివృద్ధి పనులకు రూ. 1.75 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ముందుగా వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా తరలివచ్చి మంత్రి అంబటికి ఘన స్వాగతం పలికారు. మంగళ హారతులు ఇచ్చి, పూలమాలతో సత్కరించారు. శాలువాలతో అంబటిని సన్మానించారు. నాయకులు, అధికారులు వార్డులో పర్యటించడంతో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, నాయకులు అచ్యుత శివప్రసాద్, మాదిగొండ చంటేశ్వరి, సహారా మౌలాలి, కోడిరెక్క దేవదాస్, ఎస్‌ఎం యూనస్, అనీఫ్, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

సేవాభావంతో రోగులకు వైద్యం అందించాలి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సూపరింటెండెంట్ వెంకట్రావును సత్కరించిన మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వైద్యులందరూ సేవాభావంతో రోగులకు వైద్యం అందించాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు మార్గనిర్దేశం చేశారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో బుధవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి, మాట్లాడారు. సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలు వైద్యశాల సదుపాయాల కోసం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గత నెల 30న గురుకుల పాఠశాలలో 206 మంది విద్యార్థులు అస్వస్థతకి గురైన సందర్భంలో వారిని ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించడం జరిగిందన్నారు. అప్పుడు హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రతి డాక్టర్, సిబ్బంది ఎంతో అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. పిల్లలందరికీ సరైన చికిత్స.. సరైన సమయంలో అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావుని ప్రత్యేకంగా అభినందించారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ తరపున డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, శానిటరీ సిబ్బందిని సన్మానించారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్, ఆక్సిజన్ ప్లాంట్ సిద్ధమయ్యాయని, త్వరలోనే ప్రారంభించాలని విన్నవించారు. ఫిజియో థెరపీ విభాగానికి పరికరాలు అవసరమని దానిని హెచ్‌డీఎస్ ఫండ్స్ నుంచి కొనుగోలు చేయాలని విన్నవించారు. జనరిక్ మెడికల్ ఏర్పాటు చేయాలని కోరారు. కంటి ఆపరేషన్‌కు సంబంధించి కొన్ని పరికరాలు అవసరమని, మరికొన్ని రోజుల్లో కంటి ఆపరేషన్లు ఇక్కడే చేయడానికి సులువుగా ఉంటుందని ప్రస్తావించగా దానికి కావాల్సిన ఫండ్స్ సీఎస్ఆర్ఎం నుంచి వెంటనే ఇప్పిస్తానని మంత్రి, చైర్మన్ అంబటి రాంబాబు తెలియజేశారు. హాస్పటల్ సూపరిండెంట్ డాక్టర్ వెంకట్రావు, అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, డాక్టర్ గిరిజ, డాక్టర్ రాజమోహన్ రెడ్డి, ఏపీ ఎంఎస్ ఐడీ ఈఈ శ్రీధర్, డీఈ భాగ్యలక్ష్మి, ఏఈ వెంకట్, మెగా ఇంజినీరింగ్ ప్రతినిధులు సతీష్, నవీన్, స్టాఫ్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలి

సత్తెనపల్లి: పన్నులు చెల్లించి పట్టణాబివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో 2022–23 సంవత్సరానికి చెల్లించవలసిన గృహ, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు, ఆక్రమణ పన్నులు, ప్రకటన చార్జీలు నిర్దేశించిన సమయంలోగా చెల్లించాలని స్పష్టం చేశారు. లేదంటే.. నోటీసులు జారీ చేయకుండానే ఇంటి కొళాయి కనెక్షన్ తొలగించడం జరుగుతుందన్నారు.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి



వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

నకరికల్లు: రెవెన్యూ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం ముఖ ఆధారిత హాజరు వేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రబీ సీజన్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో పనిచేసి ఈ–క్రాప్ నమోదు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వేకి సంబంధించి భూ యజమానుల నుంచి హక్కుపత్రాలు, ఫోన్ నంబర్లు సేకరించి కార్యాలయంలో అందజేయాలన్నారు. బీఎల్వోల వద్ద పెండింగ్‌లో ఉన్న 6బీ దరఖాస్తులను సకాలంలో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. వ్యవసాయ గణన ద్వారా భూ కమతాల వివరాలను అగ్రి సెన్సెస్ దరఖాస్తులో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను దూషించడం.. భారత జాతిని అవమానించడమే

సత్తెనపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దూషించడం అంటే భారత జాతినే అవమానించినట్లని అంబేడ్కర్ ప్రజా సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు దావులూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. అంబేడ్కర్‌ను దూషించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో సీఐ యూ శోభన్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దావులూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ హర్ష ప్రసాద్ ఉరఫ్ హమారా ప్రసాద్ అనే వ్యక్తి వెబ్ చానల్ ద్వారా అంబేడ్కర్‌ను అసభ్యకరంగా దూషించాడని చెప్పారు. రాముడు, కృష్ణుడి రహస్యాలనే పుస్తకాన్ని రాసిన విషయం తనకు అంబేడ్కర్ బతికి ఉన్న సమయంలో తెలిసి ఉన్నట్లైతే.. గాంధీని గాడ్సే చంపినట్లుగా తాను అంబేడ్కర్‌ను చంపేవాడినని వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. ఇది తమను ఎంతో బాధకు, క్షోభకు గురిచేసిందన్నారు. హర్ష ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, గుంటూరు ఆశీర్వాదం, జిల్లెళ్ళ పాల్ రాజ్, జూపల్లి పాల్, పాపారావు, ఎస్.మోహన్ రావు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న ఎంపీడీఓ

పెదకూరపాడు: క్షయ బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యంతో పాటు, ఉచితంగా పౌష్టికాహారం అందిస్తుందని ఎంపీడీఓ నరసింహారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. రాగిపిండి, బెల్లం, వేరుశనగ విత్తనాలు, మినపప్పు లాంటి పదార్థాలు పౌష్టికాహారంలో ఉన్నాయని డాక్టర్ వెలుగొండారెడ్డి తెలిపారు. క్షయ బారిన పడిన వారు ప్రభుత్వం ఇచ్చే మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నుంచి త్వరగా కోలుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దిలీప్, శ్రీనివాసరావు, సుభాషిణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్లు వీరే..

సత్తెనపల్లి: నియోజకవర్గ పరిధిలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలకు వైఎస్ఆర్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్లు నియమించడం జరిగింది. ఒక్కో మండలంలో మరో నలుగురు కో–కన్వీనర్లను పార్టీ నియమించింది. ఈ మేరకు పార్టీ నేతలు బుధవారం వివరాలు వెల్లడించారు. సత్తెనపల్లి పట్టణ కన్వీనర్‌గా గోగిరెడ్డి అజయ్ రెడ్డి, కో–కన్వీనర్లుగా ఎస్కే ఇజాజ్ అహ్మద్, జెట్టి రాజీవ్ గాంధీ, పటాన్ జబీయుల్లాఖాన్ ను నియమించారు. అలాగే.. సత్తెనపల్లి రూరల్ మండల కన్వీనర్‌గా నెల్లూరి వెంకట్, కో–కన్వీనర్లుగా బాదుగు ఏసోబు, దాసు మాధవరావు, తిప్పిరెడ్డి వీరారెడ్డి, మర్రి శివ ప్రసాద్... ముప్పాళ్ల మండల కన్వీనర్‌గా కురిచేటి పెద వెంకయ్య, కో–కన్వీనర్లుగా యర్రం మణికంఠ రెడ్డి, షేక్ మహబూబ్ జాన్, మన్నెం చిన్న కోటి, రామిరెడ్డి అడపా.. రాజుపాలెం మండల కన్వీనర్‌గా గుండా మణిదీప్ కుమార్, కో–కన్వీనర్లుగా షరీఫ్, షఫీ, యమర్తి బ్రహ్మయ్య, గున్నుపాటి శ్రీనివాసరెడ్డి.. నకరికల్లు మండల కన్వీనర్‌గా షేక్ నాగులు మీర, మండల కో–కన్వీనర్లుగా పొనుగుపాటి వెంకయ్య, తాతపూడి వెంకటేష్, దుర్గి శ్రీనును నియమించారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తనిఖీల భయం.. షట్టర్లు క్లోజ్

క్రోసూరు: నరసరావుపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఈ సాంబశివరావు క్రోసూరులోని మెడికల్ షాపులను బుధవారం తనిఖీ చేశారు. సంజీవని మెడికల్ షాపు తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. షాపుల్లో రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని, మందుల స్టాక్ రికార్డులు ఉంచాలని సూచించారు. మందుల ధరలు, నాణ్యత, లభ్యత గురించి ఫిర్యాదు చేసేందుకు సంబంధిత వెబ్‌సైట్, 0863–2330909 నంబరును తప్పని సరిగా షాపు ఎదుట పెట్టాలని సూచించారు. గడువు ముగిసిన మందుల షాపుల్లో ఉంచకూడదని తెలియజేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వస్తున్న సమాచారం తెలుసుకున్న మిగతా షాపుల నిర్వాహకులు యథావిధిగా షట్టర్లు క్లోజ్ చేసి వెళ్లిపోయారు.

మనుస్మృతి పత్రాలు దగ్ధం

క్రోసూరు: భారత రాజ్యాంగాన్ని అవమానించే విధంగా మనుస్మృతి గ్రంథాన్ని ఆవిష్కరించడం చట్ట విరుద్ధమని దళిత, గిరిజ ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ప్రాచీన భారత రాజ్యాంగం మనుస్మృతి గ్రంథాన్ని ఆవిష్కరించిన నేపథ్యంలో దాన్ని వ్యతిరేకిస్తూ క్రోసూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల సెంటర్‌లో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి రాక ముందు దేశంలో మనుస్మృతి మహిళలకు, దళితలకు, గిరిజలకు, బలహీన వర్గాలకు, మైనార్టీలకు, కొన్ని అగ్ర కులాలకు కూడా చదువులు దూరం చేసిందని విమర్శించారు. సమస్త దురాచారాలకు కారణం మనుస్మృతి అని ఆరోపించారు.

ఎమ్మెల్యే నివాళి

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పాట్లపల్లి అప్పిరెడ్డి(65) బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరై మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పిరెడ్డి లేని లోటు పార్టీకి తీరనది అని పేర్కొన్నారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఎంపీపీ పి.కోటయ్య, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, బెల్లంకొండ ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, షేక్ గఫూర్, పాశం శ్రీనివాసరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, రవి చౌదరి, , ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ డాక్టర్ షరీఫ్, విప్పల రాజశేఖరెడ్డి, గ్రామ నాయకులు నివాళులర్పించారు.

• నందన భవనం.. గురుకులం

నేడు భవనాలను ప్రారంభించనున్న రాష్ట్ర మంత్రులు





సత్తెనపల్లి: మండలంలోని రామకృష్ణాపురంలో రూ.15.5 కోట్లతో డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం ఇక్కడ 480 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. తరగతులు, వసతికి, వంట గది, భోజనశాల, ప్రిన్సిపల్, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అన్ని రకాల సౌకర్యాలతో గురుకుల భవనాలను తీర్చిదిద్దారు. గురవారం భవనాల ప్రారంభోత్సవం జరుగనుంది. ప్రారంభ అతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, అతిథులగా రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, విడుదల రజిని, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరుకానున్నారు.





దమ్మాలపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, ఎస్.సూర్యప్రకాశరావు పాల్గొని 224 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. మధ్యాహ్నం నుంచి అనారోగ్యానికి గురై మంచంలో ఉన్న రోగులకు వైద్యసేవలందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవిచంద్ర, పీటర్‌డానియేల్, నాగమల్లేశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే తిరునాళ్ల విజయవంతం

- భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- ఘాట్‌రోడ్డు గుండా నడచివెళ్లేందుకు అనుమతిలేదు
- విలేకర్ల సమావేశంలో డీఎస్పీ విజయభాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విజయభాస్కరరావు, రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తులు, వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందికలగకుండా, కొండ వద్ద ట్రాఫిక్ జామ్‌కాకుండా కొన్ని నిబంధనలు పాటించాలని డీఎస్పీ సి.విజయభాస్కరరావు కోరారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండగ రోజున ఘాట్‌రోడ్డుగుండా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నడిచి వెళ్లేందుకు భక్తులకు అనుమతి లేదన్నారు. వారు మెట్ల మార్గంగుండానే ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. నరసరావుపేట పట్టణం నుంచి కొండకి వచ్చే ప్రభలు మధ్యాహ్నం 2గంటల నుంచి బయలుదేరి యల్లమంద, గురవాయపాలెం గ్రామాల మీదుగా సాయంత్రం 6గంటలకు ప్రభలు నిల్చునే ప్రాంతానికి చేరుకోవాలన్నారు.

- వీఐపీ పాస్ కలిగి నరసరావుపేట నుంచి కొండకు వచ్చే భక్తులు పెట్లూరివారిపాలెం మీదుగా ఘాట్‌రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన వీఐపీ పార్కింగ్‌లో తమ వాహనాలను పార్క్ చేసి ప్రభుత్వం ఏర్పాటుచేసిన బస్సుల్లో కొండపైకి చేరుకోవాలన్నారు.
- చిలకలూరిపేట నుంచి పాస్‌లతో వచ్చే భక్తులు యూటీ సెంటర్ నుంచి క్రషర్స్ మార్గం గుండా వీఐపీ వెహికల్ పార్కింగ్ చేరుకోవాలన్నారు. వీఐపీ పాస్‌లు కేవలం కొండ పైకి చేరుకునేందుకే గాని ఉచిత దర్శనానికి పనికిరావని వెల్లడించారు.
- కొండ నుంచి తిరిగి వెళ్లే భక్తులలో నరసరావుపేటవైపునకు వెళ్లేవారు రెడ్ల సత్రం మీదుగా చిలకలూరిపేట మేజర్ కెనాల్ మీద ఏర్పాటుచేసిన రూట్‌లో మాత్రమే వెళ్లాలన్నారు. గురవాయపాలెం, యల్లమంద గ్రామాల మీదుగా వెళ్లేందుకు అనుమతిలేదన్నారు.
- వీఐపీ, జనరల్ పార్కింగ్ నుంచి తిరిగి వెళ్లేవారు కొండకావూరు, వమిడిమర్రు గ్రామాల నుంచి జేఎన్‌టీయూ మీదుగా వినుకొండ–నరసరావుపేట హైవే రోడ్డుపైకి చేరుకోవాలన్నారు.
- సంతమాగులూరు, అద్దంకి మండలాల నుంచి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వాహనాల ద్వారా వచ్చే భక్తులు మన్నెపల్లి నుంచి లక్ష్మీపురం, పెట్లూరివారిపాలెం మీదగా ఘాట్‌రోడ్డు పక్కనే గల జనరల్ పార్కింగ్‌కు చేరుకోవాలన్నారు. ఇదే ప్రాంతాల నుంచి ప్రభల వద్దకు వచ్చేవారు మన్నేపల్లి, తంగేడుమల్లి, గురిజేపల్లి, యుటీ గ్రామాల మీదుగా ప్రభల నిధి చేరుకోవాలన్నారు.
- మన్నేపల్లి నుంచి కోటప్పకొండకు ట్రాఫిక్ అనుమతించమన్నారు. ఏఎంరెడ్డి కళాశాల ఎదురుగా గల పోలీసు చెక్ పోస్టు నుంచి కొండవైపునకు ప్రైవేటు వాహనాలకు అనుమతిలేదన్నారు.
- చిలకలూరిపేట నుంచి ప్రభల వద్దకు వచ్చే ట్రాఫిక్ యడవల్లి నుంచి అట్టలఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న రోడ్డు గుండా కట్టుబడివారిపాలెం గ్రామం మీదుగా ప్రభలు నిల్చునే ప్రదేశానికి చేరుకోవాలన్నారు.
- కోటప్పకొండ నుంచి చిలకలూరిపేటవైపుకు వెళ్లేవారు యుటీ జంక్షన్ నుంచి కట్టుబడివారిపాలెం, కమ్మవారిపాలెం గ్రామాల మీదుగా చెరువురోడ్డు గుండా చిలకలూరిపేటకు వెళ్లాలన్నారు. ఈ విధంగా భక్తుల సౌకర్యార్థం పోలీసులు ఏర్పాటుచేసిన ట్రాఫిక్ నియంత్రణ మార్గాలను పాటిస్తూ తిరునాళ్ల విజయవంతానికి సహకరించాలని డీఎస్పీ కోరారు. సమావేశంలో రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.